క్లుప్తంగా

సొసైటీ సమావేశం వాయిదా



సభ్యులు హాజరుకాకపోవడంతో వెలవెలబోతున్న సమావేశం

టి.నరసాపురం: సహకార సంఘం (సొసైటీ)లో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే జనరల్ బాడీ సమావేశాన్ని వాయిదా వేసినట్లు చైర్మన్ మాధవీమూర్తి తెలిపారు. గురువారం సహకార సంఘం ఆవరణలో జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. అయితే ఈ సమావేశానికి కేవలం 13 మంది రైతులు హాజరు కావడంతో వాయిదా వేసినట్లు ఆమె తెలిపారు. సహకార సంఘంలో సుమారు 3,120 మంది సభ్యులు ఉన్నారు. కనీస సభ్యులు హాజరుకాకపోవడంతో సభను వాయిదా వేసినట్లు, తదుపరి తేదీ ముందుగా రైతులకు తెలియపరుస్తామని వివరించారు. కార్యక్రమంలో చింతలపూడి డీసీసీబీ బ్యాంక్ మేనేజర్ చిట్టిబొమ్మ శ్రీనివాస్, సూపర్‌వైజర్ కాశగాని రామకృష్ణ, సొసైటీ కార్యదర్శి మిండ అగస్టీన్, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల తనిఖీ



వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ప్రాంతీయ రవాణా శాఖ అధికారులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయం ఆధ్వర్యంలో విద్యా సంస్థల బస్సులు తనిఖీ చేశారు. గురువారం పట్టణంలోని ఎస్సార్ బంక్ సమీపంలో ప్రాంతీయ రవాణా శాఖ అధికారి ఎండీ మదని స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనం ఫిట్‌నెస్, ఇన్స్యూరెన్స్, పొల్యూషన్, డ్రైవర్ అర్హతలు, ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. ఫిట్‌నెస్, ఇన్స్యూరెన్స్, లైసెన్స్ లేని వాహనాలకు జరిమానాలు విధించారు. ఈ స్పెషల్ డ్రైవ్‌లో మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్ఎస్ రంగనాయకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మానవత ఆర్థిక సాయం



బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న మానవత సభ్యులు

పోలవరం రూరల్: విద్యుదాఘాతానికి గురై గాయపడిన బొబ్బిలి సన్యాసిరావుకు మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రూ.5 వేల ఆర్థిక సాయం అందించింది. పోలవరం మండల యూనిట్ ఆధ్వర్యంలో పట్టిసీమ గ్రామానికి చెందిన సన్యాసిరావు పొలంలో పని చేస్తుండగా, విద్యుదాఘాతానికి గురై రెండు చేతులకు గాలయాలయ్యాయి. కొంత కాలంగా ఇంటి వద్దే ఉంటున్నాడు. వైద్య ఖర్చులు నిమిత్తం రూ.5వేలు సర్పంచ్ సబ్బారపు శ్రీరామచంద్రమూర్తి అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పూనెం పోసిబాబు, చైర్మన్ తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, ఆకుల నరసింహమూర్తి, చిలకా రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలు ఐక్యతతో పని చేయాలి



పోలవరంలో ఏపీజీఈఏ సంఘం డైరీని ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

పోలవరం రూరల్: పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో ఏపీజీఈఏ సంఘ డైరీలు, క్యాలెండర్లతను ఉద్యోగులకు ఏపీజీఈఏ పోలవరం యూనిట్ అధ్యక్షుడు ఎం.వెంకటేశ్వరరావు అందజేశారు. సంఘ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఉద్యోగ సంఘాలు ఐక్యతతో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సీహెచ్ శ్రీనివాసబాబు, మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు, పోలవరం యూనిట్ వైస్ ప్రెసిడెంట్ ఇ.శ్రీనివాస్ పాల్గొన్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం

జంగారెడ్డిగూడెం: పొగాకు బ్యారన్ దగ్ధమైన ఘటన మండలంలోని పంగిడిగూడెంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి రైతు, అగ్నిమాపక సిబ్బంది తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని పంగిడిగూడెం గ్రామంలో కొప్పుల సత్తిరెడ్డి వర్జీనియా సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పొగాకు బ్యారన్‌లో క్యూరింగ్ చేస్తున్న సమయంలో గురువారం ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో దాదాపు రూ.3 లక్షల విలువైన పొగాకు దగ్ధమైనట్లు రైతు సత్తిరెడ్డి తెలిపారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది కేవీ రమణ, పార్థసారథి, లక్ష్మణరావు ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

మామిడి రైతుకు గడ్డు కాలం

- ధర ఉన్నా దిగుబడి సున్నా
- తేనెమంచు పురుగు సోకి కాయలపై మచ్చలు
- ప్రత్యామ్నాయంపై మొగ్గు చూపుతున్న మామిడి రైతులు





మామిడి కాయలను చిక్కాలతో కోస్తున్న రైతులు
మచ్చ తెగులు సోకిన మామిడి కాయలు →

చింతలపూడి: ఈ ఏడాది మామిడి రైతులకు గడ్డు కాలమనే చెప్పాలి. తోటలు పూత బాగానే పూసినా తేనె మంచు తెగులు వలన చాలా ప్రాంతాల్లో పూత మాడిపోయి రాలిపోయింది. సైజుకు వచ్చిన కాయలకు కూడా మంగు తెగులు వలన మచ్చలు ఏర్పడ్డాయి. దీంతో ఈ కాయలను కొనడానికి వ్యాపారులు ముందుకు రావడం లేదు. మిగిలిన కాయల్లో మంచి సైజు వచ్చిన కాయలను వ్యాపారులు తోటల్లోనే కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. మామిడి పండ్ల ఎగుమతిలో రాష్ట్రంలో నూజివీడు తరువాత ద్వితీయ స్థానాన్ని ఆక్రమించి దేశ, విదేశాలకు ఎగుమతి మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన చింతలపూడి ప్రస్తుతం వెలవెలబోతోంది. ఈ ఏడాది నియోజకవర్గంలోని మామిడి తోటలు ఆశించిన దాని కంటే ఎక్కువగానే పూత పూశాయి. జిల్లాలోని నూజివీడు సబ్ డివిజన్‌లో 40 వేల ఎకరాల్లో చింతలపూడి ఉద్యాన శాఖ పరిధిలోని చింతలపూడి, లింగపాలెం, కామవరపు కోట, టి.నర్సాపురం, ద్వారకా తిరుమల, జంగారెడ్డిగూడెం మండలాలలో కలిపి సుమారు 12 వేల ఎకరాల్లో మామిడి తోటలు విస్తరించి ఉన్నాయి.

ప్రస్తుతం కాయలు సైజు లేకపోయినా ఎప్పుడు ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనని తయారైన కాయలను కొంతమంది రైతులు కోసి ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం లోకల్ మార్కెట్‌లోనే బంగినపల్లి మామిడి కాయల ధర టన్ను రూ.60 వేల వరకు వ్యాపారులు కొంటున్నారని రైతులు చెబుతున్నారు.

ఇతర రాష్ట్రాలకు ఎగుమతి

జిల్లా నుంచి మహారాష్ట్ర, గుజరాత్ రాష్ట్రాలకు తూతాపురి కాయలు ఎగుమతి చేస్తున్నారు. తూతాపురి కాయలు టన్ను రూ.15 వేల నుంచి రూ.25 వేల వరకు మార్కెట్‌లో ధర పలుకుతుందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రతి ఏటా ఇక్కడి నుంచి ఢిల్లీ, కలకత్తా, నాగపూర్, పూనా, అహ్మదాబాద్, హైదరాబాద్, తమిళనాడు, కేరళ రాష్ట్రాలకు మామిడి కాయలు ఎగుమతి అవుతాయి. మన రాష్ట్రంలో విజయవాడ, రాజమండ్రి, గుంటూరు, తెనాలి వంటి వ్యాపార కేంద్రాలకు ఎగుమతి చేస్తారు. ఏటా కోట్లాది ఊపాయల వ్యాపారం చేస్తారు. ఈ సీజన్‌లో వేలాది మంది కూలీలకు ఇక్కడ పనులు ఉంటాయి. అయితే ఇంతవరకూ చింతలపూడిలో కమిషన్ దుకాణాలు ప్రారంభం కాలేదు. ఉగాది తరువాత కమిషన్ దుకాణాలు ఏర్పాటు అయ్యే అవకాశం ఉంది.

కాయ సైజు పెరగలేదు



తేనె మంచు పురుగు కారణంగా ఈ ఏడాది మామిడి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. మంగు తెగులు సోకి కాయలపై మచ్చలు ఏర్పడి క్వాలిటీ తగ్గిపోయింది. ప్రస్తుతం ఇక్కడి నుంచి హైదరాబాద్, మహారాష్ట్ర, గుజరాత్ మార్కెట్‌లకు కాయలను తరలిస్తున్నాం. ప్రస్తుతం మార్కెట్‌లో ధర ఉన్నా మెట్ట ప్రాంతం తోటల్లో కాయ సైజు ఇంకా పెరగలేదు. మామిడి రైతుల సౌకర్యార్థం మెట్ట ప్రాంతంలో మామిడి కోల్డ్ స్టోరేజ్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగం ఉంటుందని ఎప్పటి నుంచో చెబుతున్నాం.

–సీహెచ్ సుధాకర్, శ్రీనివాస ఫ్రూట్ కంపెనీ, చింతలపూడి

నాటు సారా పట్టివేత



పట్టుబడిన నిందితురాలితో ఎక్సైజ్ అధికారులు

కుక్కునూరు: మండలంలోని రాజీవ్‌నగర్‌లో నాటుసారాను పట్టుకున్నట్లు జంగారెడ్డిగూడెం ఎక్సైజ్ సీఐ శ్రీనుబాబు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కుక్కునూరు మండలంలో దాడులు నిర్వహించామన్నారు. రాజీవ్‌నగర్‌లో ఐదు లీటర్ల నాటు సారాతో ఒక వ్యక్తిని, 10 మద్యం సీసాలతో ఒక మహిళను అరెస్టు చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ వై.ఫణికుమార్, ఎస్సై జి.వెంకటలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

ఆరుగురు జూదరుల అరెస్టు

జంగారెడ్డిగూడెం: స్థానిక పోలీసులు పేకాట స్థావరంపై దాడి చేశారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామ శివారులో ఎస్సై షేక్ జబీర్ సిబ్బందితో కలిసి దాడి చేశారు. ఈ దాడిలో ఆరుగురిని అరెస్టు చేసి, వారి నుంచి రూ. 5700 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

దాడి కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: మహిళను కొట్టి గాయపర్చి, బోరును ధ్వంసం చేసిన నేరానికి ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ ఎస్.ఉమామహేశ్వరరావు తెలిపారు. మండలంలోని చిన్నవారిగూడేనికి చెందిన మాదాసు భూలక్ష్మి, ఆమె భర్త బుద్దాల అప్పారావుకు చెందిన ఐదు ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని వర్జీనియా పొగాకు వ్యవసాయం చేస్తున్నారు. బుద్దాల అప్పారావుకు బుద్దాల వీర్రాజుకు పొలం తగదాల నేపథ్యంలో మాదాసు భూలక్ష్మి సాగు చేస్తున్న పొలంలోని కరెంటు వైర్లు, మోటార్లు పాడు చేసి పొగాకు పంటకు బుద్దాల వీర్రాజు నష్టం కలిగిస్తున్నాడన్నారు. విషయాన్ని పెద్దల్లో కూడా పెట్టామన్నారు. అయితే ఈ నెల 19వ తేదీ ఉదయం వీర్రాజు పొలంలోకి ప్రవేశించి వెనుక నుంచి భూలక్ష్మిని పట్టుకుని నోరునొక్కి, అసభ్యకరంగా ప్రవర్తించి, కొట్టాడన్నారు. అలాగే బోరును ధ్వంసం చేశాడన్నారు. ఈ మేరకు భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు హెచ్‌సీ తెలిపారు.

ఆక్రమణల క్రమబద్ధీకరణకు అవకాశం

ద్వారకాతిరుమల: అభ్యంతరం లేని ప్రభుత్వ పోరంబోకు భూమిని ఆక్రమించుకుని, నివాసం ఉంటున్న వారికి ఇంటి స్థలాన్ని క్రమబద్దీకరణ చేయడానికి ప్రభుత్వం అవకాశం ఇచ్చిందని తహసీల్దార్ జేవీ సుబ్బారావు గురువారం తెలిపారు. అయితే 2019 అక్టోబర్ 15కు ముందు నుంచి సదరు స్థలంలో నివాసం ఉన్నవారే అర్హులని ఆయన పేర్కొన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు మీసేవా కేంద్రంలో గాని, గ్రామ సచివాలయాల్లో గాని దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వివాదరహిత స్థలాలకు వర్తింపు

కొయ్యలగూడెం: ప్రభుత్వ భూములను ఆక్రమించుకొని ఇళ్లను నిర్మించుకున్న వారి పేరున రెగ్యులరైజేషన్ చేస్తున్నట్లు తహసీల్దార్ కె.చెల్లన్నదొర గురువారం తెలిపారు. వివాదరహితమైన స్థలాలకు ఇది వర్తిస్తుందన్నారు. ఇందుకు సంబంధించి ఇంటిలోని మహిళ పేరున ప్రభుత్వం అధికారికంగా రెగ్యులరైజేషన్ చేస్తుందన్నారు. దీనికి సంబంధించి ఎలక్ట్రిసిటీ బిల్‌తో పాటుగా ప్రభుత్వ స్థలంలో ఇల్లు ఉన్నట్లుగా నిర్ధారించబడిన ఆధారాలను సమర్పించాలన్నారు.

25 నుంచి ముత్యాలమ్మ ఆలయ వార్షికోత్సవం



వార్షికోత్సవాల ఆహ్వాన పత్రికను విడుదల చేస్తున్న మున్సిపల్ కమిషనర్, తదితరులు

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయ పంచమ వార్షికోత్సవం ఈ నెల 25వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ తెలిపారు. గురువారం ఆలయంలో వార్షికోత్సవ వేడుకల ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ వార్షికోత్సవ వేడుకలు తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతులు శివస్వామి శిష్యులు బ్రహ్మచారి విద్యా శంకరానంద స్వామి వారిచే శైవాగమ రీతిలో వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తారన్నారు. ఆధ్యాత్మిక సేవా ప్రతినిధి ఈమని శశికుమార్ ఆధ్యాత్మిక సేవలు, పూజలు, హోమాల వివరాలు వెల్లడించారు. ఆహ్వాన పత్రికలను ముఖ్య అతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కేవీ రమణ ఆవిష్కరించగా కార్యక్రమంలో భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ఆగని డీజిల్ అక్రమ విక్రయాలు



అక్రమంగా డీజిల్ విక్రయిస్తున్న దుకాణదారుడు

కొయ్యలగూడెం: అక్రమంగా విక్రయిస్తున్న డీజిల్ దందా అడ్డూ అదుపు లేకుండా పోయింది. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం అచ్యుతాపురం, తూర్పుగోదావరి జిల్లా జగన్నాథపురం గ్రామాల మధ్య ఉన్న టీ స్టాల్ డీజిల్ దందాకి కేంద్రంగా మారింది. దీనిపై ఇప్పటికే పలు ఫిర్యాదులు వెళ్లినప్పటికీ దందాను అరికట్టాల్సిన సంబంధిత అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. ఆయిల్ బంకుల్లో లభించే డీజిల్ కంటే రూ.5 తక్కువగా లభిస్తుండడంతో కొనుగోలుదారులు అక్రమ విక్రయ కేంద్రం వద్ద వాహనాలతో సహా క్యూ కడుతున్నారు. డీజిల్ అక్రమ విక్రయదారుడు లారీల నుంచి అసలు ధర కంటే రూ.20 తక్కువగా కొనుగోలు చేసి రోజుకు దాదాపు రూ.50 వేల డీజిల్‌ను బయటకు విక్రయిస్తున్నాడు. దేవరపల్లి మండల సమీపంలో ఇదే విధంగా అక్రమ డీజిల్ విక్రయ కేంద్రంపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించి చర్యలు తీసుకున్నారు. కానీ అచ్యుతాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య డీజిల్ విక్రయ కేంద్రం వైపు దృష్టి సారించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

నూతన వ్యవసాయ చట్టాన్ని రద్దు చేయాలి



సమావేశంలో పాల్గొన్న నాయకులు

జంగారెడ్డిగూడెం: నూతన వ్యవసాయ జాతీయ మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం(ఏఐయుకేఎస్) సభ్యులు డిమాండ్ చేశారు. జంగారెడ్డిగూడెంలో గురువారం ఏఐయూకేఎస్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జాతీయ కన్వీనర్ ఎస్‌కే గౌస్ మాట్లాడుతూ నూతన వ్యవసాయ జాతీయ మార్కెట్ చట్టాన్ని రద్దు చేయాలని, మద్దతు ధరలు చట్టబద్ధం చేయాలని కోరుతూ శాంతియుత ఉద్యమం చేస్తున్న రైతు సంఘం జాతీయ నాయకులను అరెస్టు చేయడం దారుణమన్నారు. మే 8న దేశ వ్యాప్తంగా ఏఐయుకేఎస్ ఆధ్వర్యంలో నూతన వ్యవసాయ చట్టం రద్దు, మద్దతు ధర్లపై ఆందోళన కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు చెప్పారు. బి.సత్యనారాయణ, వి.అర్జప్ప పాల్గొన్నారు.

పంట చేలకు దారేది ?



పొంగుటూరు-ఈవిడిపాలెం మధ్య శిథిలమైన తూములు

కొయ్యలగూడెం: గోరింకల వాగు కల్వర్టు పునరుద్ధరించి గ్రావెల్ రోడ్డుతో సహా తూములు ఏర్పాటు చేయాలని పలు గ్రామాల రైతులు కోరుతున్నారు. పొంగుటూరు నుంచి యర్రంపేట పంచాయతీ పరిధిలోని ఏడువాడల పాలెం, గంగన్నగూడెం గ్రామాలకు చేరుకోవడానికి గోరింకల కల్వర్టు దోహదపడుతుందన్నారు. అయితే కొద్ది సంవత్సరాల క్రితం పంట తూములు, రహదారి వరదలకు కొట్టుకుపోవడంతో నడవడానికి కూడా రాకపోకలు సాగించలేని దుస్థితికి చేరిందన్నారు. దీంతో పండిన పంటను గమ్య స్థానాలకు చేర్చడానికి ఏడు కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించాల్సి వస్తోందని కల్వర్టు నిర్మిస్తే 1.5 కిలోమీటర్ల లోపు రైతులు చేరుకోవచ్చన్నారు. రెండు సంవత్సరాల క్రితం కల్వర్టు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపగా అప్పటి నుంచి సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా సమస్యను పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు.

కొండ కాలువలపై కల్వర్టులు నిర్మించాలి




నినాదాలు చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

బుట్టాయగూడెం: ఏజెన్సీ ప్రాంతంలోని కొండ కాలువలపై కల్వర్టులు, వంతెనలు నిర్మించాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మొడియం నాగమణి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చి వాగ్దానాలను అమలు చేయాలని కోరుతూ ఆ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రజా చైతన్య యాత్ర నాల్గో రోజు బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొండవాగులపై కల్వర్టులు, వంతెనలు లేకపోవడం వల్ల వర్షాకాలంలో ప్రజలు వాగులు దాటేందుకు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వాగులపై కల్వర్టులు నిర్మించి ప్రమాదాలు నివారించాలని కోరారు. కార్యక్రమంలో తెల్లం రామకృష్ణ, కారం భాస్కర్, పోలోజు నాగేశ్వరరావు, చుండ్రు బుల్లెమ్మ, కె.భీమరాజు, ఎస్.సాయికృష్ణ, పి.శాంతి, కూరం సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామనవమికి సెలవు ప్రకటించాలి

కొయ్యలగూడెం: శ్రీరామనవమి రోజు ప్రభుత్వం అన్ని శాఖలకు కచ్చితంగా సెలవును అమలు చేయాలని ఆర్ఎస్ఎస్ ప్రముఖ్ వేదుల జనార్దన్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీరామనవమి రోజున ప్రవేశ పరీక్షలు నిర్వహించరాదన్నారు. నవమి రోజున సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో (ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్) ద్వారా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాల్లో నిర్వహించే బ్రాగ్ సెట్ పరీక్షలు వాయిదా వేసుకోవాలన్నారు. అదే విధంగా నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు, జూనియర్ ఇంటర్ ప్రవేశ పరీక్షలు కూడా వాయిదా వేయాలన్నారు. నవమి రోజున పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం ప్రకటన విడుదల చేసిందన్నారు. శ్రీరామనవమి హిందువులకు అత్యంత పవిత్రమైన పండుగన్నారు. ప్రభుత్వం పునరాలోచించి పరీక్షలను వాయిదా వేయాలని తెలిపారు.

గిజిగాడి క్షేమం కోసం..!





భీమేశ్వరరావు ఇంటి వద్ద ఏర్పాటు చేసిన పిచ్చుక గూళ్లు, ధాన్యం కంకులు
పిచ్చుక

ద్వారకాతిరుమల: ఇంటి సూరుల్లో, వాసాలపై, వసారాల్లో తిరిగి వడ్ల గింజలను పొడుచుకు తింటూ, కిచకిచమని అల్లరి చేసే పిచ్చుకలు అంటే ఎవరికైనా ఇష్టమే. అమ్మమ్మలు చెప్పే కాకి-పిచ్చుక కథల్లో కూడా పిచ్చుకే తెలివైనది. అంతే కాదు పిచ్చుక ఓ సోషలిస్ట్. తినాలనుకున్నంతే తిని తుర్రున ఎగిరిపోతుంది. చేటలో బియ్యం చెరుగుతుంటే, అమ్మలక్కలను పలకరించేవి ఈ పిచ్చుకలే. బాణంలా ఇంట్లోకి దూసుకొచ్చి గిరికీలు కొట్టినా, అద్దంలో ముఖం చూసుకుని మురిసిపోయినా అది పిచ్చుకలకే చెల్లుతుంది. అంతే కాదు తొలి పంటను పిచ్చుక తింటే మంచిదన్న నమ్మకం రైతుల్లో నేటికీ పోలేదు. అందుకే ద్వారకాతిరుమల మండలం రామన్నగూడేనికి చెందిన మాజీ సర్పంచ్, వైఎస్సార్‌సీపీ నేత పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు తన ఇంటి వద్ద పిచ్చుక గూళ్లు, ధాన్యం కుచ్చులను ఏర్పాటు చేశారు. పిచ్చుకలు ఆ గూళ్లల్లో ఉంటూ, ధాన్యాన్ని తింటున్నాయి. గురువారం ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా భీమేశ్వరరావు వాటి సంరక్షణకు చేపడుతున్న చర్యలను వివరించారు. అలాగే ఎండలు మండిపోతున్న తరుణంలో వాటికి ధాన్యం వేసి, నీళ్లు పెట్టాలని అందరినీ కోరుతున్నారు.

వైఎస్సార్ పేరు తొలగింపు దారుణం

దెందులూరు: విశాఖపట్నంలో క్రికెట్ స్టేడియంకు ఉన్న వైఎస్సార్ పేరు తొలగించడం దారుణమని వైఎస్సార్ సీపీ ఏలూరు జిల్లా కార్యదర్శి డీబీఆర్‌కే చౌదరి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం పోతునూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృష్ణా జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టడం ఆయనపై ఉన్న గౌరవానికి నిదర్శనం అన్నారు. ఎన్టీఆర్‌ను టీడీపీ పభుత్వం, చంద్రబాబు గౌరవించి ఉంటే ఆయన జన్మించిన కృష్ణా జిల్లాకు ఆయన పేరు పెట్టే వారిని, భారతరత్న పురస్కారానికి సిఫార్సు చేసే వారిని వివరించారు. కక్షపూరిత ధోరణిలో విశాఖపట్నంలో క్రికెట్ స్టేడియానికి ఉన్న వైఎస్ రాజశేఖరరెడ్డి పేరును తొలగించడం దారుణమని తెలిపారు. చరిత్ర ఉన్నంతకాలం ఆరోగ్యశ్రీ అంటే వైఎస్సార్ అంటే ఆరోగ్య శ్రీ అనేలా కీర్తిని వైఎస్సార్ సంపాదించుకున్నారని గుర్తుచేశారు. మహానేత విగ్రహాలు, ఆయన పేరును చూస్తే కూటమి ప్రభుత్వ పెద్దలకు వణుకు పుడుతోందని అన్నారు.



దేవస్థానం క్యాంటీన్ వద్ద చెట్టు నీడలో సేదతీరుతున్న భక్తులు



గుండుకు చందన లేపంతో చిన్నారితో భక్తుడు

శ్రీవారి భక్తులకు ఎండ సెగ



దర్శనం క్యూలైన్ల వద్ద ఏర్పాటు చేసిన కూలర్లు



శ్రీవారి దర్శనానంతరం తడి మ్యాట్లపై నడుచుకుంటూ బయటకు వెళుతున్న భక్తులు

ద్వారకాతిరుమల: భానుడి భగభగలతో శ్రీవారి భక్తులు అల్లాడుతున్నారు. రోజురోజుకు ఎండలు, ఉక్కబోత తీవ్రం అవుతుండటంతో ద్వారకాతిరుమల క్షేత్రానికి వస్తున్న భక్తులు భీతిల్లుతున్నారు. వేడి నుంచి ఉపశమనం పొందేందుకు పరుగులు తీస్తున్నారు. తలపై టవళ్లు, కర్చీఫ్‌లు కప్పుకోవడం, టోపీలు పెట్టుకోవడం వంటివి చేస్తున్నారు. మరి కొందరు గొడుగులను వినియోగిస్తున్నారు. చెట్టు నీడ కనిపిస్తే చాలు.. దాని కిందకు చేరి సేద తీరుతున్నారు. ఇదిలా ఉంటే ఎండ వేడిమి నుంచి భక్తులకు ఉపశమనం కల్పించేందుకు దేవస్థానం అధికారులు ఇప్పటికే పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా క్యూలైన్ల వద్ద కూలర్లను, తాగు నీటిని ఏర్పాటు చేశారు. అలాగే తూర్పు రాజగోపుర ప్రాంతం నుంచి ప్రసాదం కౌంటర్ల వరకు పీచు మ్యాట్లను ఏర్పాటు చేసి, నిరంతరంగా వాటిని తడుపుతున్నారు. అలాగే ఆలయ ప్రధాన రాజగోపుర మెట్ల మార్గంలో నీరు పారేలా ఏర్పాటు చేశారు. వీటి వల్ల భక్తుల పాదాలకు రక్షణ కలుగుతోంది. ఈ చర్యలతో భక్తులు కాస్త ఉపశమనం పొందుతున్నారు.



తడి మ్యాట్‌పై నడుచుకుంటూ శ్రీవారి ప్రసాదాలకు వెళుతున్న భక్తులు